సాక్షి
జనగామ

శనివారం । 14 । జనవరి । 2023



ఐలోని జాతర షురూ

ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణంతో దేవుళ్లకు ఆవాహన పలికారు.

- 8లో▸



రేపు వందేభారత్ రైలు

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సంక్రాంతి కానుకగా వరంగల్ మీదుగా పరుగులు తీయనుంది. ఆదివారం పీఎం మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/15^0$

ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్గోలో ఉద్యోగాలు

జనగామ: ఆర్టీసీ స్థానిక లాజిస్టిక్స్ కార్గోలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధి అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి, ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేసేందుకు నలుగురు వ్యక్తులు అవసరమున్నట్లు పేర్కొన్నారు. పార్సిల్ ట్రాకింగ్‌తో పాటు బుకింగ్, డిస్పాచ్ సెక్షన్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విభాగం 9949219199, 9154298762 నంబర్లలో సంప్రదించాలన్నారు.

టీజీయూజీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్ : పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ 2023 టీజీయూజీ సెట్‌కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీఓ డీఎస్.వెంకన్న కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రియ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుతున్న వారు అర్హులని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతమైతే రూ.2 లక్షలకు మించకూడదన్నారు. ఫిబ్రవరి 5 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కళాశాలలో బీకాం సీఏ, బీకాం జనరల్, బీఏ హెచ్‌ఈపీ, బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ ఎంపీసీ ఎస్, బీఎస్సీ స్టాట్స్, ఎంజెడ్‌సీ, బీజెడ్‌సీ కోర్సుల్లో ప్రవేశాలున్నాయని పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి

బచ్చన్నపేట : గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాల చుట్టూ పచ్చని మొక్కలు నాటి, లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. పలు గ్రామాల్లో స్థలం అనుకూలంగా లేక ఇంతవరకు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయలేదని, దాతల సహాయంతోనైనా ఏర్పాటు చేయాలని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్ : భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఎస్ఆర్ కేఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 24న హైదరాబాద్‌లో జరిగే సర్వసభ్య సమావేశంలో జిల్లా, మండల, గ్రామ కమిటీల బాధ్యులు పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వాతాల యాదగిరి, ఉపాధ్యక్షుడు నాగయ్య, తుడి అంజయ్య, కృష్ణ, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో అఘోర స్వాములు



జనగామ రూరల్: కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న అఘోర స్వాములు శుక్రవారం జనగామ మండలం చీటకోడూర్‌లోని శ్రీ పంచకోసు రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వరాచార్యులు ప్రత్యేక పూజల అనంతరం ఆలయ వైభవాన్ని వారికి వివరించారు. అనంతరం స్వాములు రామేశ్వరానికి పయనమయ్యారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లులో కడియం ఫౌండేషన్ సహకారంతో స్వాగత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం మ్యాచ్‌లను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, మారుడోజు రాంబాబు, బూర్ల శంకర్‌ముదిరాజ్ ప్రారంభించారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఛాగల్లు సర్పంచ్ సారంగపాణి మాట్లాడుతూ.. మొత్తం 70 టీమ్‌లు పాల్గొంటున్న ఈ టోర్నమెంట్ శనివారం ముగుస్తుందని చెప్పారు. ఫైనల్ మ్యాచ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్, కోశాధికారి చింతకింది సుధాకర్, ఉప సర్పంచ్ పొన్న రజితరాజేష్, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, అన్నెపు కుమార్, చింతకింది సుధాకర్, ముక్కెర రవి, సానాది రాజు, ఎ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనగామ పట్టణంలో పతంగులు ఎగుర వేస్తున్న చిన్నారులు



ఆనంద కాంతులు

- మొదలైన సంక్రాంతి వేడుకలు
- పల్లె, పట్నం లోగిళ్లలో సందడి
- నేడు భోగి పండుగ

జనగామ: మూడురోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకునే సంక్రాంతి పండుగ రానే వచ్చింది. జిల్లా వ్యాప్తంగా వేడుకలు మొదలయ్యాయి. 14న భోగి, 15న మకరసంక్రాంతి, 16న కనుమ పండగలను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాల సభ్యులు సొంతూళ్లకు చేరడంతో లోగిళ్లలో ఆనంద కాంతులు విరజిమ్ముతున్నాయి. రైతన్నలు పండించిన పంటలు ఇళ్లకు చేరడంతో కొత్త ధాన్యంతో పిండి వంటలు చేసే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు.

భోగ భాగ్యాల భోగి..

భోగ భాగ్యాలను ఇచ్చే భోగితో సంక్రాంతి పండుగ మొదలవుతుంది. వాడవాడలా భోగి మంటలతో ఉత్సాహంగా గడుపుతారు. తెల్లవారు జామునే నిద్రలేచి.. ఎముకలు కొరికే చలిలో.. పాత వస్తువులు.. ఆవుపేడతో తయారు చేసిన పిడకలను భోగి మంటల్లో వేసి వెచ్చదనం ఆస్వాదిస్తూ.. కొత్త జీవితాన్ని ఆరంభిస్తారు. సంధ్యా సమయంలో మహిళలు, చిన్నారులు ఇళ్లలో బొమ్మల కొలువులను ఏర్పాటు చేసి.. పండుగ జరుపుకుంటారు. రేగు పండ్లు(భోగిపళ్లు), శనగలు, పూలతో చిన్న పిల్లలకు ఆశీర్వచనాలు ఇచ్చి దిష్టి తీస్తారు.

గాలిపటాల జోరు

విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తున్నారు. చిన్నా పెద్దా అంతా కలిసి ఖాళీ స్థలాలు, వీధులు, డాబాలు, మైదానాల్లో ఎక్కడ చూసినా పతంగుల జోరు కనిపిస్తోంది. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, పోలీస్‌స్టేషన్ ఏరియా, నెహ్రూపార్క్, స్వర్ణకళామందిర్ రూట్ తదితర ప్రాంతాల్లో ఫ్యాన్సీ పతంగుల విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపించాయి.



రేగుపండ్లు, గరక కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రారంభమైన పండుగ సందడి

భోగిని పురస్కరించుకుని రంగవల్లులు, మామిడాకులు, చామంతి, బంతి, ఆవుపేడ, రేగుపండ్లు, నవధాన్యాలు, గరిక, పిండి కూరాకు మొదలైనవి కొనేందుకు వచ్చిన వారితో శుక్రవారం రాత్రి పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. యువతులు గాజులు, తదితర అలంకరణ వస్తువులు, సంక్రాంతి నోము సామగ్రి కొనుగోలు చేశారు.



పతంగుల దుకాణంలో..



పిండి వంటలు చేస్తున్న మహిళలు



ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్

భక్తుల కొంగుబంగారం ఆలేటి ఎల్లవ్వ



ఆలేటి ఎల్లవ్వ ఆలయం



ఆలయంలో ఎల్లవ్వ

- బమ్మెర శివారులో నేటి నుంచి జాతర
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

పాలకుర్తి: భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న ఆలేటి ఎల్లవ్వ జాతర శనివారం ప్రారంభం కానుంది. బమ్మెర శివారు ఎల్లమ్మ గడ్డతండా సమీపాన ఉన్న ఆలయంలో ప్రతి ఏటా జరిగే ఈ జాతర ఉత్సవాలకు పాలకుర్తి మండలంతోపాటు రఘునాథపల్లి, దేవరుప్పుల, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్ మండలాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. పాలకుర్తి, అయ్యంగారిపల్లి, బమ్మెర, తిర్మలగిరి, ఇరవెన్ను గ్రామాల మధ్య కుంటకింద పొలాల్లో ఆలేటి ఎల్లవ్వ వెలసింది. బమ్మెర జీపీ ఆధ్వర్యాన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 14న జాతర ప్రారంభం, 15న బండ్లు తిరుగుట, 16న అమ్మవారికి బోనాలు, పట్నాలు, జాతర ఉత్సవం ఉంటుంది. జాతరకు ఎల్లరాయని తొర్రూరు, పాలకుర్తి, ఈరవెన్ను, తిర్మలగిరి, బమ్మెర నుంచి మహిళలు బోనాలతో, రైతులు ఎడ్లబండ్లపై తరలివస్తారు. అలాగే అన్ని గ్రామాల నుంచి వాహనాల్లో వేలాదిగా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, వాహనాలు తిరగడానికి స్థలం లేదు. అయ్యంగారిపల్లి రైతుల పట్టా భూములు ఉండడంతో ప్రతి ఏటా జాతర వరకు వరి నాట్లు వేసుకోకుండా వేచి ఉంటున్నారు. పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

నేటినుంచి బంజర మల్లన్న జాతర

- జోగు బ్రదర్స్‌చే ముస్తాబవుతున్న ఆలయం

దేవరుప్పుల : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటా జోగు బ్రదర్స్‌చే భోగి పండుగతో ప్రారంభమయ్యే బంజర మల్లన్న జాతర శనివారం నుంచి మొదలు కానున్నది. పెద్దమడూరుకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన జోగు బ్రదర్స్ ఆధ్వర్యంలో చిన్నమడూరు రెవెన్యూ పరిధి బంజర గ్రామ పంచాయతీ శివారులో నిలయమైన బంజర మల్లన్న జాతర ఏళ్ల నుంచి కొనసాగుతోంది. పండుగ నిర్వహణకు ఎక్కడో స్థిరపడిన జోగు బ్రదర్స్ కుటుంబాలు శుక్రవారం రాత్రి వరకు పెద్దమడూరుకు చేరుకుంటాయి. శనివారం ఉదయం యాదవ సంప్రదాయ రీతిలో డప్పుచప్పుళ్లు, శివసత్తులు పూనకాల మధ్య మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల కోసం మహిళలు బోనాలతో ప్రదర్శనగా వెళ్లి మొక్కులు సమర్పిస్తారు. పండుగరోజు ఒగ్గు పూజారులచే ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాన్ని నిర్వహిస్తారు. ఒగ్గు కళాకారులు జాతర విశిష్టతను వివరిస్తారు. దేవరుప్పుల, గుండాల, లింగాలఘణపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ.



బంజరలో ముస్తాబైన మల్లన్న ఆలయం

నేటి నుంచి మార్కెట్‌కు సెలవులు

జనగామ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనగామ వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండగ నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందని, రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. 17న యథావిధిగా కొనుగోళ్లు చేపడతామని పేర్కొన్నారు.

చదువుతోనే సామాజిక చైతన్యం

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

లింగాలఘణపురం: చదువుతోనే సామాజిక చైతన్యం వస్తుందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బండ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన కురుమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. ఐకమత్యంతోనే రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని, బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా సంఘం తీర్మానం చేసుకోవాలని సూచించారు. 45 ఏళ్ల క్రితం పీజీ చేసి ఉద్యోగం సంపాదించిన తాను రాజకీయాల్లోనూ 14 ఏళ్లు మంత్రిగా పని చేశానని, ఇవన్నీ చదువుతోనే సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. కురుమల సమస్యలు, రాజకీయ అవకాశాలపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు మండలంలో సంఘానికి రెండు భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బీర్ల ఐలయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, యాదగిరిగుట్ట ఎంపీపీ సీర శ్రీశైలం మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన కురుమలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయ్‌మనోహర్, దేవేంద్ర, యాదమ్మ, స్వరూపరాణి, శ్రీధర్, ఎంపీటీసీ భిక్షపతి, మాధవి, నాయకులు విజయ్‌భాస్కర్, మదార్, శేఖర్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం

సీఎం దృష్టికి అర్చక ఉద్యోగుల సమస్యలు

- జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్.శర్మ

పాలకుర్తి టౌన్: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంఘం రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డీవీఆర్.శర్మ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీఓ 577 ఇచ్చినా ప్రతి నెలా వేతనాలు తీసుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై గురువారం మానుకోటకు వచ్చిన సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అర్చక ఉద్యోగులకు పెన్షన్, జిల్లా కేంద్రంలో దేవాదాయ స్థలాల పంపిణీతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అలాగే దేవాలయాల్లో దశాబ్దాలుగా పదోన్నతి లేకుండా పనిచేస్తున్న అర్చక, ఉద్యోగులు, సిబ్బందికి నూతన క్యాడర్‌స్ట్రెంత్ ఇవ్వడంతోపాటు గ్రేడ్ 1,2,3 ఈఓల పదోన్నతులు కల్పించాలని, మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన తాత్కాలిక ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని కోరినట్లు వివరించారు. త్వరలో సమీక్ష నిర్వహించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు శర్మ చెప్పారు. సమావేశంలో సంఘం జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రకాళి సత్యం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిక ఆనందర్‌శర్మ, రెడ్యాల శ్రీనివాస్, బాలకృష్ణశర్మ, శ్రీకాంత్‌చార్యులు పాల్గొన్నారు.

క్రీడలకు సర్కారు ప్రోత్సాహం

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్/పాలకుర్తి: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోంది.. ఇందుకుగాను ప్రతి గ్రామంలో ఎకరం భూమి కేటాయించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధి వావిలాల గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పోతన, పాల్కురికి సోమనాథుడు, వాల్మీకి పుట్టిన బమ్మెర, పాలకుర్తి, వల్మిడి, సన్నూరు ప్రాంతాలకు పూర్వ వైభవం తేవడానికి రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. పాలకుర్తిలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత హోటల్ నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్‌కుమార్, సర్పంచ్ పద్మభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పోతన విగ్రహావిష్కరణ

పాలకుర్తి మండలం బమ్మెర బస్టాండ్ ఆవరణలో బమ్మెర పోతన విగ్రహాన్ని విగ్రహ దాత నాగాచారి దంపతులు, ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో కలిసి మంత్రి దయాకర్‌రావు ఆవిష్కరించారు. అలాగే మండల కేంద్రంలోని సేవాలాల్ గుడి నిర్మాణ ప్రాంతంలో బంజారా ఉద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ గుడికి పాలకుర్తిలో రూ.5కోట్ల విలువైన స్థలం కేటాయించామని, ఆలయ నిర్మాణానికి ఇప్పటికే రూ.కోటి ఇచ్చినట్లు పేర్కొన్నారు. పది కోట్లయినా పర్వాలేదు.. గుడి రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉండాలన్నారు. పిల్లలకు హాస్టల్ కట్టిస్తానని చెప్పిన మంత్రి.. నిర్మాణం నాది.. నిర్వహణ మీది అని అన్నారు. సమావేశంలో డాక్టర్ భూక్య రవి రాథోడ్, పూల్‌సింగ్‌చౌహాన్, సురేష్‌పవార్, ప్రేమ్‌సింగ్ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడల పూర్వవైభవానికి కృషి

దేవరుప్పుల: గ్రామీణ క్రీడలకు పూర్వవైభవం తేవడానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎర్రబెల్లి యువసైన్యం ఆధ్వర్యంలో శుక్రవారం సీర్మాలలో అంతర్‌జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గూడూరు(జనగామ) జట్టుకు ప్రథమ బహుమతి రూ.20వేలు, సుద్దాల(యాదాద్రిభువనగిరి) జట్టుకు ద్వితీయ బహుమతి రూ.12వేలు, జాజిరెడ్డిగూడెం(సూర్యాపేట) జట్టుకు తృతీయ బహుమతి రూ.6వేల నగదు, షీల్డులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భార్గవి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్టేట్ మెంబర్ పల్ల సుందర్‌రామిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కళ్యాణివెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, డైరెక్టర్లు కొత్త జలంధర్‌రెడ్డి, నర్సింహులు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభించి కబడ్డీ ఆడుతున్న మంత్రి



దేవరుప్పుల: విజేత జట్టుతో మంత్రి ఎర్రబెల్లి

నకిలీ ముఠా గుట్టు రట్టు

టీజీఏను బలోపేతం చేయాలి

పట్టుదలతో చదివితే అనుకున్న లక్ష్యం

ఆలయాల భూముల పరిరక్షణకు చర్యలు

- వివరాలు 10లో▸

‘కంటి వెలుగు’కు సర్వం సిద్ధం

- విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్: జిల్లాలో ఈనెల 18 నుంచి నిర్వహించే ‘కంటి వెలుగు’ రెండో విడత కార్యక్రమానికి సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య అన్నారు. కంటి పరీక్షలపై ప్రత్యేక అధికారులు, మెడికల్ ఆఫీసర్, సిబ్బందితో క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కంటి పరీక్షల శిబిరాలను విజయవంతం చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రత్యేక బృందాలు ఆయా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 26 క్యాంపులు ఏర్పాటు చేసి ఏఆర్ మిషన్లు, సామగ్రిని తరలించామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులకు సూచించారు. పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎ.మహేందర్, డీఆర్డీఓ రాంరెడ్డి, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీపీఓ వసంత, డీఈఓ రాము, సీపీఓ ఇస్మాయిల్, నోడల్ అధికారి డాక్టర్ కె.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య, పాల్గొన్న అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే

కంటిచూపు మందగించి ప్రైవేటు వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద కుటుంబాలకు వెలుగునిచ్చే బాధ్యత మనందరిపై ఉంది.. ‘కంటి వెలుగు’ కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన ‘కంటి వెలుగు’ ఏర్పాట్ల సమీక్షలో ఆయన మాట్లాడారు. పట్టణంలో వైద్య శిబిరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారనే సమాచారం ప్రజలకు ముందే తెలియజేయాలన్నారు. శిబిరాల వద్దకు వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. పరీక్షలు చేసిన వెంటనే రీడింగ్ అద్దాలు అందజేస్తారని, దృష్టి లోపం ఉన్నవారికి సంబంధించి కంటి అద్దాలు నేరుగా ఇంటికి వస్తాయని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ రజిత, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపు ఓటములు సహజం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ రూరల్: ఆటల పోటీల్లో గెలుపు ఓటములు సహజమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేత ఎర్రగొల్లపహాడ్ జట్టు, రెండో స్థానంలో నిలిచిన నర్మెట మండలం నర్సాపూర్ జట్టుకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సర్పంచ్ వంగాల రేణుక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. యువత సమాజ సేవలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ నాయకుడు నరేందర్, బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధిలింగం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

నర్మెట: యువత విద్య, ఉద్యోగం, ఉపాధితో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, సోషల్ మీడియా అధ్యక్షుడు గాదెర ప్రభాకర్, టౌన్ అధ్యక్షుడు నక్కల రవి, వార్డు సభ్యులు అంజనేయులు, మహేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

క్లుప్తంగా

పాముకాటుతో బాలుడి మృతి


హిమాన్షు (ఫైల్)

ములుగు రూరల్: పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన ములుగు మండలం మల్లంపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన నత్తి రాజు కుమారుడు హిమాన్షు(2) గురువారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుని ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో నాగపాము కాలుపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి హిమాన్షు మృతి చెందాడు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సారంగపాణి తెలిపారు.

ప్రాణం తీసిన రైలు ప్రయాణం

- మెట్ల పైనుంచి జారిపడి యువకుడి మృతి

జనగామ: పండుగ వేళ రైలు ప్రయాణం ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకుంది. జనగామలోని అంబేడ్కర్ నగర్ శివారులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన రొయ్యల సాయిప్రసాద్(22) డ్యాన్స్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. డ్యాన్స్ ప్రోగ్రాం కోసం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన సాయిప్రసాద్ కాజీపేట నుంచి రైలులో జనగామకు బయలుదేరాడు. జనగామకు మరో ఐదు నిమిషాల్లో రైలు చేరుకుంటుందనగా మెట్లపై కూర్చున్న సాయిప్రసాద్ ప్రమాదవశాత్తు కిందపడిపోయి మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కాజీపేట రైల్వే ఎస్సై కె.అశోక్ కుమార్ తెలిపారు.

జాతరకు వస్తున్న భక్తులు



బోనం సిద్ధం చేస్తున్న భక్తురాలు



పట్నం వేస్తున్న ఒగ్గు కళాకారులు



ఐలోని జాతర షురూ..

- ధ్వజారోహణంతో దేవుళ్లకు ఆవాహన
- తరలివస్తున్న భక్తులు



ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రాతఃకాలంలో ఒగ్గు పూజారులు స్వామివారికి మేలుకొలుపు పలికారు. విఘ్నేశ్వర పూజ అనంతరం ఉదయం పూజారులు మహాన్యాస రుద్రాభిషేకం జరిపించి స్వామివారికి, అమ్మవార్లకు నూతన వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు, ఈఓ ధ్వజానికి కాషాయ పతాకాన్ని ఏర్పాటు చేసి ఆ పతాకాన్ని చేతబూని వేదమంత్రాలతో ఆలయం చుట్టూ మంగళవాయిద్యాలతో మూడు ప్రదక్షిణలు చేశారు. ఆ తర్వాత ఎలాంటి ఆటంకాలు కలుగకుండా జాతర సజావుగా జరగాలని మల్లన్న పరివార దేవుళ్లను ఆవాహన జరిపి కాషాయ పతాకాన్ని ఆలయ క్షేత్ర పాలకుడైన ఆంజనేయస్వామి ఆలయంపైన, ప్రధాన ఆలయంపైన ప్రతిష్ఠించి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. అనంతరం మహాన్యాస రుద్రాభిషేకం చేసి నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్, మధుకర్‌శర్మ, మధుశర్మ, భీమన్న, పాతర్లపాటి నరేష్‌శర్మ, అధికారి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాలు, పట్నాలతో భక్తుల మొక్కులు

భక్తులు ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనం నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఎల్లమ్మకు సమర్పించుకున్నారు. కొందరు భక్తులు వరం పట్టగా, మరికొందరు టెంకాయ బంధనం, ముడుపులు కట్టారు. శివసత్తుల పూనకాలు, నృత్యాలు అలరించాయి.

చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా వీరస్వామి

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం రద్దయిన నేపథ్యంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎం.వీరస్వామిని నియమిస్తూ ఆర్జేసీ రామకృష్ణ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 17 వరకు వీరస్వామి ఆలయంలో విధులు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.


విద్యుత్ కాంతుల్లో ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయం

నేడు భోగి..

శనివారం భోగి పండుగను పురస్కరించుకుని ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, మంత్రపుష్పం, దర్శనాలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు.


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు


ఆలయ ఆవరణలో సేదదీరుతున్న భక్తులు

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 95055 14424

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

బీఆర్ఎస్ ఆవిర్భావ సభతో దేశంలో ప్రకంపనలు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ఖమ్మంలో ఈ నెల 18న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభ దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఖమ్మంలో నిర్వహించే బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు జన సమీకరణపై శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని వెలికట్ట శివారు గార్డెన్‌లో తొర్రూరు, పెద్దవంగర మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరితో కలిసి రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు ప్రసంగించారు. టీఆర్ఎస్ స్థాపించినపుడు కరీంనగర్ సభ చరిత్రలో ఎలా నిలిచిపోయిందో అదే విధంగా ఖమ్మంలో జరిగే సభ అలానే ఉంటుందన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ ప్రజలందరికీ అందించేందుకు కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్తున్నారన్నారు. మానుకోట సభలో సీఎం.. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు నిధుల ప్రకటన ఈ ప్రాంతంపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ మోడల్ అభివృద్ధి దేశమంతా అవసరమని, దానికి కేసీఆర్ నడుం కట్టారన్నారు. గుజరాత్ మోడల్‌ను చూపి మోదీ ప్రధాని అయ్యారని, ప్రస్తుతం ఆ మోడల్ దేశానికి నిరుపయోగమన్నారు. కార్యక్రమంలో లింగాల గణపురం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, తొర్రూరు, పెద్దవంగర బీఆర్ఎస్ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, ఈదురు ఐలయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో మంత్రి 'గంగుల' తండ్రి అస్థికల నిమజ్జనం

కాళేశ్వరం: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. శుక్రవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరిలో మల్లయ్య అస్థికలకు మంత్రి.. తన సోదరులతో కలిసి శ్రాద్ధకర్మ పూజలు నిర్వహించారు. అనంతరం త్రివేణి సంగమం వద్ద నిమజ్జనం చేశారు. అంతకు ముందు మంత్రి గంగులను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట తహసీల్దార్ శంకర్, సివిల్‌సప్లయీస్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


తండ్రి అస్థికలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి

కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేస్తున్న ఈఓ రాజేంద్రం, అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మల గద్దె ప్రాంగణంలో కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు చేసేందుకు దేవాదాయశాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సాంకేతిక నిపుణులతో కలిసి కన్వేయర్ బెల్ట్ ఏర్పాటు కోసం స్థల పరిశీలించారు. ఫిబ్రవరి 1 నుంచి 4 తేదీ వరకు జరిగే మేడారం మినీ జాతరలో ప్రయోగాత్మకంగా కన్వేయర్ బెల్ట్ పనితీరును పరిశీలించనున్నారు. కాగా, జాతరలో గద్దెల వద్ద భక్తులు సమర్పించిన బంగారం(బెల్లం) పేరుకుపోతుంది. భక్తుల రద్దీ ఉన్న సమయంలో బంగారం ప్రసాదంగా అందించడం అధికారులకు సాధ్యం కావడంలేదు. అయితే ఈసారి క్యూలైన్లలో వచ్చే భక్తులు అమ్మవార్లకు సమర్పించే బంగారాన్ని కన్వేయర్ బెల్ట్ వద్ద చేరవేస్తే అది నేరుగా అధికారులు నిర్ణయించిన ప్రదేశానికి చేరనుంది. దీంతో అమ్మవార్ల గద్దెల వద్ద భక్తులు ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి జరిగే మినీ జాతరలో ఈ కన్వేయర్ బెల్ట్ విధానం ఏర్పాటు చేయడం ద్వారా సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించనున్నారని ఈఓ రాజేంద్రం తెలిపారు.

18న పారిశుద్ధ్య సామగ్రి పంపిణీకి వేలం

మినీ మేడారం జాతరలో పారిశుద్ధ్య పనులకు బ్లీచింగ్ పౌడర్, సున్నం, తట్టలు, పారలు, ఫినాయిల్, తదితర సామగ్రి సరఫరా కోసం ఈనెల 18న ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డీపీఓ వెంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94410 01504 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

21న ఐటీడీఏ జాబ్‌మేళా

- 1,100 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన యువతీయువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెల 21న ములుగు జిల్లా జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 1,100 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ, ఎంబీఏ, బీటెక్ చదివిన వారు విద్యార్హతల పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

వరంగల్ మీదుగా రేపు వందేభారత్ రైలు

- సికింద్రాబాద్– వైజాగ్ మధ్య ప్రయాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కాశిబుగ్గ/కాజీపేట రూరల్: వరంగల్ ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 15న సంక్రాంతి కానుకగా వరంగల్ మీదుగా పరుగులు తీయనుంది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య నడిచే ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే సమయంలో సికింద్రాబాద్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ జెండా ఊపుతారు. వారంలో ఆదివారం మినహా మిగతా ఆరు రోజులు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పరుగులు పెట్టనుంది. విశాఖపట్నంలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మధ్యలో రాజమండ్రి, విజయవాడ, ఖమ్మంలో ఆగుతూ మధ్యాహ్నం 12.05 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై వరంగల్‌కు సాయంత్రం 4.35 గంటలకు చేరుకుంటుంది. ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి మీదుగా రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుటుంది. రైలు మొత్తం ఏసీతో కూడిన 18 బోగీలు ఉంటాయి. లోకో పైలెట్ క్యాబిన్‌కు అనుసంధానంగా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుంది. ప్రయాణికులకు అవసరమైన అన్ని అత్యాధునిక సదుపాయాలు ఈ రైలులో ఉన్నాయి. వరంగల్‌లో ఒక నిమిషం హాల్ట్ మాత్రమే ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

వర్చువల్‌గా ప్రారంభం..

ప్రధాని మోదీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభిస్తున్నారు. 02844 నంబర్‌తో సికింద్రాబాద్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరుతుంది. ప్రారంభించిన రోజు మాత్రం చర్లపల్లి, భువనగిరి, జనగామ, కాజీపేట జంక్షన్, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మదిర, కొండపల్లి, విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడెపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపుడి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడస్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు. రాత్రి 7గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది. ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నందున ప్రయాణికులకు అనుమతి లేదు. 16వ తేదీ నుంచి 20833/20834 నంబర్లతో ఈ రైలు విశాఖపట్టణం–సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తుంది. ఈ రైలులో ప్రయాణించాలంటే రిజర్వేషన్ చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు. కానీ టికెట్ ధరలు మాత్రం ప్రకటించలేదు. దేశంలోని వందే భారత్ రైళ్లకు వర్తించిన విధంగానే టికెట్ ధరలు ఉంటాయని అధికారులు తెలిపారు. కాగా, కాజీపేట జంక్షన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలికి ఇక్కడి నుండి ఎంపీ, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులతో ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్యాసింజర్ రైలు రద్దు

డోర్నకల్: విజయవాడ – కొత్తగూడెం మధ్య నడిచే ప్యాసింజర్ రైలును శనివారం నుంచి నాలుగు రోజుల పాటు రద్దు చేశారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లు నడుస్తుండడంతో ఈ నెల 16వ తేదీ వరకు విజయవాడ – కొత్తగూడెం ప్యాసింజర్ రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటించారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని..

- పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గీసుకొండ: మద్యానికి డబ్బు ఇవ్వలేదని పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రేటర్ వరంగల్ ఆదర్శ నగర్‌కు చెందిన తేజావత్ పంతులు(50) తాగుడుకు బానిసయ్యాడు. శుక్రవారం మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంకా డబ్బు కావాలని తన భార్య సాలమ్మను అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. విషయాన్ని భార్యతో పాటు బంధువులకు చెప్పడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పంతులు మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

వేధింపులతో ఒకరు..

సంగెం: వీఆర్ఏ వాటా కోసం దాయాదులు వేధించడంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం నార్లవాయిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తాడెం పాపయ్యకు ఇద్దరు కుమారులు పెద్ద సాయిలు, చిన్న సాయిలు, కూతురు గుంటక లక్ష్మి ఉన్నారు. పాపయ్య అనంతరం పెద్ద కుమారుడు పెద్ద సాయిలు పేరున వీఆర్ఏ పట్టా ఉంది. ఒప్పందం ప్రకారం ఏడాదికి ఒకరు చొప్పున పెద్ద సాయిలు, చిన్న సాయిలు, గుంటుక సదానందం వీఆర్ఏ వాటాదారులుగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం వాటాదారు వ్యవస్థను తీసిసి పట్టాదారు పేరునే పర్మనెంట్(పే స్కేల్) చేస్తామని ఉత్తర్వులు ఇవ్వడంతో గొడవ మొదలైంది. దీంతో ఉద్యోగ విషయమై వాటా పరిహారం కోసం మాట్లాడుకుందామని మిగిలిన ఇద్దరు పట్టుబట్టడంతో వీఆర్ఏ యూనియన్, పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని పెద్ద సాయిలు చెప్పాడు. వారు దానికి ఒప్పుకోలేదు. ఈ క్రమంలో పెద్ద సాయిలు కుమారుడు తాడెం పాపయ్య వారం రోజుల క్రితం పొలం దున్నేందుకు ట్రాక్టర్‌ను పిలవగా చిన్న సాయిలు, చిన్న పాపయ్య, గుంటుక సదానందం, శ్రీకాంత్ అడ్డుకున్నారు. వాటా విషయం తేలిన తర్వాతే దున్నుకోవాలని వేధింపులకు గురిచేశారు. శుక్రవారం సైతం అడుకుని ఉద్యోగ విషయం పరిష్కారమైన తర్వాతే భూమి దున్నుకోవాలని చెప్పారు. దీంతో మనస్తాపం చెందిన తాడెం పాపయ్య(51) పొలం వద్ద పురుగుల మందు తాగాడు. ఇంటికి రాకపోవడంతో అతడి కుమారుడు చరణ్ పొలం వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. దీంతో ఎంజీఎంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే పాపయ్య మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సంగెం పోలీసులు తెలిపారు.


పాపయ్య (ఫైల్)